క్లుప్తంగా

విశ్వనాథునికి రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు

మనుబోలు : మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో సోమవారం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. నావూరు శశిరెడ్డి, మాలిని దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌కు ఘన నివాళి



ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల కలిసి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రొట్టెల పండగకు వినూత్న స్వాగతం



ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం సోమవారం గాజు సీసాపై బారాషహీద్ దర్గా చిత్రాన్ని ఆక్రోలిక్ కలర్స్‌తో చిత్రీకరించారు. ఈనెల 17వ తేదీ నుంచి నెల్లూరు స్వర్ణాల చెరువు వద్ద రొట్టెల పండగ ప్రారంభమవుతున్న సందర్భంగా ఈ చిత్రం ద్వారా భక్తులకు స్వాగతం పలికారు.

అర్జీల స్వీకరణ

పొదలకూరు : ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి.శివకృష్ణ సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన రైతులు భూవివాదాలు, భూముల సర్వే, పాసు పుస్తకాల పంపిణీ తదితర సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(లీగల్): జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కృష్ణకాంత్ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామినిని మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న ఆమె చాంబర్‌లో కలిసి పూల మొక్కను అందజేశారు.

నెల్లూరు పీఠాధిపతులే గంధోత్సవం నిర్వహించాలి

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా రొట్టెల పండగలో భాగంగా పవిత్ర గంధ మహోత్సవాన్ని నెల్లూరు పీఠాధిపతులే నిర్వహించాలని, స్థానికేతరులతో నిర్వహించడం మత సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధమని నెల్లూరు సాదాత్ మషాయఖ్ వెల్ఫేర్ ముస్లిం మత పీఠాధిపతుల సంఘం, పీఠాధిపతుల కమిటీ అధ్యక్షుడు కేఎస్ఎస్ బాబా బందన వాజ్ పేర్కొన్నారు. నగరంలోని చిన్నబజార్‌లో ఉన్న ఖాజాపీర్ మకాన్‌లో ముస్లిం మత పీఠాధిపతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన గంధ మహోత్సవాన్ని కొందరు వ్యక్తులు వారి ప్రయోజనాల కోసం రాజకీయం చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సమావేశంలో పీఠాధిపతులు సయ్యద్ ఫయాజ్ రజ్వీసాహెబ్, సయ్యద్ జాహెద్‌సాహెబ్, సయ్యద్ సర్తాజ్‌సాహెబ్ పాల్గొన్నారు.

భృతి అంతా.. భ్రాంతి

- ఎప్పుడిస్తారా అని ఎదురుచూపులు
- నెలదాటినా నోరుమెదపని ప్రభుత్వం

చంద్రబాబు కూటమి మేనిఫెస్టో అయిన సూపర్ సిక్స్ పథకాల్లో తొలి ప్రాధాన్యతలో ఉన్న నిరుద్యోగ భృతి లేదా ఉపాధి కల్పనపై యువత కోటి ఆశలు పెట్టుకుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తారని భావించిన యువతకు ఎదురుచూపే మిగులుతోంది. ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం కల్పించడం లేదా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల భృతిని అందజేసే బాధ్యత తీసుకుంటామని ప్రకటించింది. దీంతో యువతలో ఆశలు చిగురించి చిన్నపాటి ఉద్యోగాలు చేయడం ఇష్టం లేక ఇప్పుడిప్పుడే చదువులు పూర్తి చేసుకున్న వారు భృతి లేదా ఉద్యోగం వెంటనే వస్తుందని ఆశగా నిరీక్షిస్తున్నారు. అయితే గతానుభవాలను దృష్టిలో ఉంచుకున్న కొందరు యువకులు భృతిపై పెదవి విరుస్తున్నారు.

పొదలకూరు/ కోవూరు : 2014 ఎన్నికల్లో చంద్రబాబు నిరుద్యోగ యువతకు నెలకు రూ.2 వేలను భృతిగా అందజేస్తానని హామీ ఇచ్చారు. అయితే అమలు చివరి వరకు తాత్సారం చేస్తూ ఆఖరులో అమలు చేశారు. ప్రస్తుతం నెలకు నిరుద్యోగ భృతిగా రూ.3 వేలు ఇస్తామని ప్రకటించడంతో చాలామంది యువకులు ఓట్లు వేశారు. అయితే ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుండడంతో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతానుభవాలే మిగులుతాయనే అభిప్రాయం కూడా వెలిబుచ్చుతున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు 91 వేల కుటుంబాలు, కోవూరు నియోజకవర్గంలో లక్షా 12 వేల కుటుంబాలు ఉన్నాయి. దాదాపుగా ప్రతి ఇంట్లో నిరుద్యోగ యువతతో పాటు చదువుకుంటున్న వారు కొత్తగా బయటకు వస్తున్నారు. ఫలితంగా వీరంతా నిరుద్యోగ భృతి, ఉద్యోగాలపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. చంద్రబాబుతో పాటు ఆయన తనయుడు లోకేశ్, కూటమి భాగస్వామి పవన్‌కల్యాణ్ ఏటా తమ ప్రభుత్వం 4 లక్షల ఉద్యోగాలను కేటాయించి ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలను కల్పిస్తుందని హామీ ఇచ్చారు. దీంతో తమకు కూడా ఉద్యోగ అవకాశం కలుగుతుందని యువత వేచిచూస్తున్నారు. కొందరు యువకులు చిన్నపాటి ఉద్యోగాలు వచ్చినా వెళ్లకుండా ఎదురుచూస్తున్నట్టు సమాచారం.

సర్వేపల్లిలో 91 వేల కుటుంబాల నిరీక్షణ

కోవూరులో 1.12 లక్షల కుటుంబాల నిరీక్షణ





ఉద్యోగాలు వస్తాయనే ఓటేశా



రెండేళ్ల క్రితమే డిగ్రీ పూర్తి చేశా. అప్పటి నుంచి ఉద్యోగావకాశాలు రాకపోవడంతో ఖాళీగానే ఉన్నా. మధ్య తరగతి కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. చదువుకున్న యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇవ్వడంతో వారికి ఓటు వేశా. ఉద్యోగావకాశం కల్పిస్తారని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నా. అప్పటి వరకు కనీసం నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– కె.సుకుమార్‌రెడ్డి, మనుబోలు

ఆశగా ఎదురు చూస్తున్నా



ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నా. గత ఐదారేళ్లుగా ఎటువంటి ఉద్యోగం రాకపోవడంతో ఖాళీగానే ఉన్నా. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఆర్థికంగా కుటుంబానికి భారంగా అనిపిస్తుంది. చంద్రబాబు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, లేనివారికి నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇవ్వడంతో ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నా.

– తుపాకుల గిరి, సీఎం నగర్, మనుబోలు

ఉద్యోగ హామీ నిలబెట్టుకోండి



నేను డిగ్రీ పూర్తి చేసి, పీజీ సగంలో ఆపేశాను. అధికారంలోకి వస్తే ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారు. లేకుంటే నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. మాది నిరుపేద కుటుంబం. ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో ప్రకటించాలి. సీఎం ప్రకటన కోసం ఎదురుచూస్తున్నా.

– వెడిచర్ల అనిత, ఈపూరు, ముత్తుకూరు మండలం

డీఎస్సీ కోసం ఎదురుచూపులు



నేను మెఎస్సీ, బీఈడీ చదుకున్నా. డీఎస్సీలో ఉద్యోగం సాధించాలని ఎదురు చూస్తున్నా. అయితే డీఎస్సీ మరింత జాప్యం జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మెగా డీఎస్సీ అని ప్రకటించిన ప్రభుత్వం జిల్లాలకు స్వల్పంగా పోస్టులను ఇవ్వడం నిరుత్సాహానికి గురిచేసింది. ఈ ఏడాది డీఎస్సీ పరీక్ష రాస్తామనే నమ్మకం లేకుండాపోతోంది.

– జి.దయాకర్, నిరుద్యోగి, చిట్టేపల్లి, పొదలకూరు మండలం

ఉద్యోగం వస్తుందని ఎదురుచూస్తున్నా..



నేను ఎమ్మెస్సీ చదువుకున్నా. ఈ ప్రభుత్వంలో ఉద్యోగం వస్తుందని ఎదురుచూస్తున్నా. ఉద్యోగం రావడం ఆలస్యం అయితే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ప్రభుత్వం అందజేస్తుందని గంపెడు ఆశతో ఉన్నా. అయితే ఇప్పటి వరకు భృతిపై ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించలేదు.

– కె.సూర్యకుమార్, పొదలకూరు

నిరుద్యోగ భృతైనా ఇవ్వండి



డిగ్రీ పూర్తి చేసి చాలా రోజులైంది. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నా. ఉద్యోగం లభించే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు వాగ్దానం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 40 రోజులవుతోంది. ఉద్యోగం వచ్చేలోపు కనీసం భృతి ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా.

– సింగిరి మహేష్, బ్రహ్మదేవి, ముత్తుకూరు మండలం

చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలి



నేను ఎంసీఏ పూర్తి చేశా. ఉపాధి లేకపోవడంతో ఇంటి వద్దే ఖాళీగా ఉన్నా. చంద్రబాబు ఎన్నికల హామీలో భాగంగా రూ.3 వేల నిరుద్యోగ భృతి గానీ లేదా ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. చెప్పిన మాటకు కట్టుబడి ఉపాధి కల్పిస్తారని ఆశిస్తున్నాం. అప్పటి వరకైనా నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– పానేటి ప్రసన్నకుమార్, కోవూరు

నిరుద్యోగులను ఆదుకోవాలి



నేను బీఎస్సీ పూర్తి చేశా. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు నాయుడు నిరుద్యోగులకు భృతి మంజూరు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలి. నిరుద్యోగిగా ఉన్న తాను ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నా. ఉద్యోగాల భర్తీ గురించి పట్టించుకోలేదు. కనీసం నిరుద్యోగ భృతి అయినా మంజూరు చేసి నా లాంటి వారిని ఆదుకోవాలి. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాల్సి ఉంటుంది.

– బద్దెపూడి ప్రవీణ్‌కుమార్, నిరుద్యోగి, కోవూరు

నమ్మకాన్ని వమ్ము చేయొద్దు



నేడు డిగ్రీ పూర్తి చేశా. ఇంటి వద్దే ఉంటున్నా. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి. ఇచ్చిన మాట ప్రకారం మాకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. అంతవరకు నిరుద్యోగ భృతిని అమలు చేయాలి. సత్వరమే రూ.3 వేల భృతిని అందజేస్తే ఆర్థికంగా భరోసాగా ఉంటుంది. మా నమ్మకాన్ని వమ్ము చేయొద్దు.

– వంకాయల మహేష్, కోవూరు

గతం మాదిరిగా మోసం చేయకూడదు



నేను బీటెక్ పూర్తి చేశా. ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్నా. ప్రస్తుతం ఇంటి వద్దే ఖాళీగా ఉంటున్నా. చంద్రబాబు గతంలో రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేశారు. ఈసారి అలా కాకుండా క్రమం తప్పకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఇంటికో ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– రాయల వెంకట కార్తీక్, ఇందుకూరుపేట

నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇప్పించాలి



నేడు డిగ్రీ పూర్తి చేశా. ఉద్యోగాల కోసం వెతుకుతున్నా. ఇచ్చిన హామీ మేరకు మాకు ఉద్యోగాలు కల్పించాలి. అందులో భాగంగా నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇప్పించాలి. సరైన ఉపాధి కల్పనకు మార్గం చూపాలి. అప్పటివరకు ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– దక్కా హరీంద్ర, విడవలూరు

వెంటనే అమలు చేయాలి



నేను డిగ్రీ పూర్తి చేసి పదేళ్లు అవుతోంది. ఉద్యోగం కోసం అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నా. అయినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం రాలేదు. కూటమి ప్రభుత్వం రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి నెల దాటుతున్నా ఇంతవరకు దీనిపై ప్రకటన చేయకపోవడం దారుణం. వెంటనే ఇచ్చిన హామీని అమలు చేయాలి.

– గండవరపు సూరి, వరిగొండ, తోటపల్లిగూడూరు మండలం

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం



స్కూల్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగుంట వద్దనున్న కమ్యూనిటీ హాలులో విద్యార్థులకు సోమిరెడ్డి చేతుల మీదుగా స్కూల్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడంతో పాటుగా విద్యార్థులకు అన్నివసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మధుసూదన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహంలో పరిశీలన



వసతిగృహంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారులు

పొదలకూరు : స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌రిషిత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని మరుగుదొడ్లు, వంటగది, పరిసరాలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, సహాయకులు కామాక్షమ్మ, అరుణ, వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్గం పునరుద్ధరణ



పునరుద్ధరించిన చెరుకుమూడి-కురిచెర్లపాడు మార్గం

మనుబోలు : మండలంలోని చెరుకుమూడి గ్రామం నుంచి వెంకటాచలం మండలంలోని కురిచెర్లపాడు గ్రామానికి మధ్య ఉన్న దారిని రెవెన్యూ అధికారులు సోమవారం పునరుద్ధరించారు. రెండు గ్రామాలను కలుపుతూ చాలా కాలంగా నడకదారి ఉంది. ఇరు గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తుల మధ్య ఘర్షణ తలెత్తడంతో గత గురువారం చెరుకుమూడికి చెందిన కొందరు దారిని తవ్వేసి పాడు చేయడంతో మార్గం మూసుకుపోయింది. ఈ విషయంపై కురిచెర్లపాడు గ్రామస్తులు మనుబోలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాలతో ఆర్ఐ శివప్రసాద్, వీఆర్వో అఖిల్ దారిని సరిచేయించి యథాప్రకారం రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా చూడండి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు పరిష్కరించాలని తెలిపారు. అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ సక్రమంగా ఇవ్వకపోతే అదే సమస్యపై పదే పదే అర్జీలు ఇస్తారన్నారు. జిల్లాలో ప్రజారోగ్యంపై అధికారులు దృష్టి పెట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. మండలస్థాయిలో ఎంపీడీఓలు తాగునీటి పథకాలను శుభ్రం, క్లోరినేషన్ చేస్తున్నదీ లేనిదీ తెలుసుకునేందుకు ప్రతి రోజూ రెండు గ్రామ పంచాయతీలు తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్ కింద ప్రకటించడానికి జిల్లాలో 23 గ్రామాలకు సంబంధించి పబ్లిక్ హియరింగ్ ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డులతో బహుళ ప్రయోజనాలు

- ఏఓ లక్ష్మి



కొడవలూరు : సీసీఆర్ కార్డులపై కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : సీసీఆర్సీ(పంట సాగుదారు హక్కు ధ్రువీకరణ) పత్రాలతో కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని ఏఓ లక్ష్మి తెలిపారు. మండలంలోని గుండాలమ్మపాళెం, ఆలూరుపాడుల్లో పంట సాగుదారు హక్కు ధ్రువీకరణ పత్రాలపై కౌలు రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీఆర్ కార్డుల వల్ల కౌలు రైతులు వ్యవసాయశాఖ రాయితీపై ఇచ్చే విత్తనాలు పొందడంతో పాటు బ్యాంక్‌ల ద్వారా పంట రుణాలు పొందవచ్చన్నారు. అంతే కాకుండా పంట నమోదు చేయించుకుని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవచ్చని సూచించారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ ఎంతో ప్రయోజనకరమని, వీటిని ప్రతి కౌలు రైతు విధిగా పొందాలని సూచించారు. ఇందుకోసం సంబంధిత వీఏఏ, వీఆర్వోలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ ఎ.అనూష, వీఆర్వో రాహుల్ తేజ్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, వీఏఏలు కేవీ పృథ్వీ, విష్ణుప్రియ, స్థానిక నాయకుడు కె.అమరేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సాగు హక్కు పత్రాలను అందజేస్తాం

పొదలకూరు : మండలంలోని 36 రెవెన్యూ గ్రామాల్లో పంటసాగు హక్కు పత్రాలను అందజేస్తామని ఏఓ వాసు తెలిపారు. మండలంలోని తాటిపర్తి, ప్రభగిరిపట్నం, నేదురుమల్లి, బత్తులపల్లి ఆర్బీకేల్లో పంటసాగు హక్కు(సీసీఆర్సీ)పత్రాలపై ఏఓ సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో 1,364 పంటసాగు హక్కు పత్రాలను అందజేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. సీసీఆర్ కార్డుల ద్వారా పట్టాదారునికి ఎలాంటి నష్టం వాటిల్లదని చెప్పారు. సాగుదారులకు కేవలం పండించిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందన్నారు. కార్డులు కలిగిన వారు సబ్సిడీ విత్తనాలు, బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. కౌలు రైతులు సీసీఆర్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ సదస్సుల్లో ఏఈఓ ఏడుకొండలునాయక్, వీఆర్వోలు పుల్లయ్య, పెంచలయ్య, వీఏఏలు మౌనిక, అజయ్‌కుమార్, చంద్రశ్రీ, శ్రావణి పాల్గొన్నారు.



పొదలకూరు : తాటిపర్తి ఆర్బీకేలో మాట్లాడుతున్న ఏఓ వాసు



ఇందుకూరుపేట : మాట్లాడుతున్న ఏఓ రఘునాథ్‌రెడ్డి

తప్పనిసరి

ఇందుకూరుపేట : మండలంలో కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్ కార్డులు కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఇందుకూరుపేటలో కౌలు రైతుల ధ్రువీకరణ పత్రంపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కైలాసం శ్రీనువాసులు రెడ్డి, వీఆర్వో షరీఫ్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున, సహాయకులు వేణుగోపాల్, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాల, దామరమడుగు గ్రామాల్లో కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల మంజూరు గురించి మండల వ్యవసాయాధికారులు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ఏఓ సురేంధర్ రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు వీఆర్వోలను సంప్రదించి సీసీఆర్ కార్డులు పొందాలన్నారు. ఈ కార్డులతో ప్రభుత్వం అందించే పథకాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


రేపు లక్ష తులసీ దళార్చన

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి బుధవారం ఉదయం 9 గంటలకు సందర్భంగా లక్ష తులసీ దళార్చన జరుగుతుందని దేవస్థానం కమిటీ వారు సోమవారం తెలిపారు. సాయంత్రం 7 గంటలకు స్వామి, అమ్మవార్లకు పల్లకి సేవ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

విద్యాసామగ్రి వితరణ

నెల్లూరు(బృందావనం): 'చక్రాల వారి ట్రస్ట్' వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమం. గీతామయి బాలల ఆశ్రమంలో సోమవారం అన్నదానం చేశారు. విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేసినట్లు ఆ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, మేనేజర్ స్వామి సమయానంద తెలిపారు. కార్యక్రమంలో ఆదిశంకర ధ్యాన మందిరం అధ్యక్షుడు పారా గురు వేంకటశ్రీధర్‌శర్మ, అన్నవరం సత్యనారాయణ, జి.ప్రభాకర్‌శర్మ, ఒ.సుధాకర్‌శర్మ, ఆర్.మణిశంకర్‌శర్మ, ఎం.ఉదయ్‌కుమార్, చక్రాల లక్ష్మీరమణమూర్తి, వి.హరిప్రసాద్‌రావు, ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



కొమ్ము రమణయ్య(ఫైల్)

తోటపల్లిగూడూరు : ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. మండలంలోని పోట్లపూడి దళిత కాలనీకి చెందిన కొమ్ము రమణయ్య(73) సోమవారం ఉదయం 7 గంటలకు గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. 8 గంటల సమయంలో పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అప్రమత్తమైన ఫీల్డ్ అసిస్టెంట్, సహచర కూలీలు రమణయ్యను నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపానికుమార్ తెలిపారు.

పాఠశాల భద్రతా దినోత్సవం
- పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోసి పెంచాలి.
- పిల్లలందరూ చదువుకోవాలి

RAINBOW E.M. SCHOOL
BUCHIREDDYPALEM, NELLORE
CONTACT: 83098 17239, 94409 29692